











పార్కులో మొక్కను నాటుతూ..

వాహనంపై పార్కులో విహారం

సుందరీమణుల నృత్యం

ముద్దుగుమ్మల సందడి

ఎకో పార్కును సందర్శించిన వివిధ దేశాల సుందరీ మణులు

రంగారెడ్డి అర్బన్/శంకర్‌పల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి) : రంగారెడ్డి జిల్లా, శంకర్‌పల్లి మండలంలోని ఎక్స్‌పీరియం ఎకో పార్కు ముద్దుగుమ్మల రాకతో మరింత మనోహరంగా మారింది. అందాల భామల పర్యటనతో మెరిసిపోయింది. వివిధ దేశాల నుంచి వచ్చిన వనితలతో ఆ ప్రాంతం పులకరించిపోయింది. మిస్‌వరల్డ్ పోటీలను పురస్కరించుకుని నగరానికి వచ్చిన పోటీదారులు హెరిటేజ్ వాక్‌లో భాగంగా శుక్రవారం సాయంత్రం ఎకో పార్కును సందర్శించి సందడి చేశారు. పర్యాటక శాఖ అధికారులు శుక్రవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి ప్రత్యేక బస్సుల్లో వీరందరినీ శంకర్‌పల్లి మండలం పొద్దుటూరులోని 'ఏకో టూరిజం' పార్కుకు తీసుకువచ్చారు. అక్కడ అందగత్తెలకు డోలు వాయిద్యాలతో సంప్రదాయ పద్ధతిలో ఘన స్వాగతం పలికారు. డోలు చప్పుళ్లకు అందగత్తెలు స్టెప్పులేశారు. పార్కులో సన్‌డైనర్ పాయింట్, బుద్ధ ఇన్‌సైడ్ ట్రీస్పాట్, రెడ్‌టైల్ ఫార్మేషన్ స్పాట్, గొడుగు ఆకారంలో ఉన్న ట్రీ స్పాట్, ఈజిప్షియన్‌రాక్ స్పాట్‌ను తిలకించి పులకించిపోయారు. ప్రతీ స్పాట్‌లో ఫొటోలకు ఫోజులిచ్చారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరిస్తాం

» కలెక్టర్ నారాయణరెడ్డి



రిటైర్మెంట్ బెనిఫిట్ సర్టిఫికెట్‌ను అందజేస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి, ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ చందా పండిట్

రంగారెడ్డి అర్బన్, మే 16 (ఆంధ్రజ్యోతి) : పెన్షనర్ల సమస్యలు పరిష్కారం కానున్నట్లు కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం పెన్షన్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ చందా పండిట్, డిప్యూటీ అకౌంట్ జనరల్ అభయ్ సోనాకర్, జిల్లా ఖజానా అధికారి బి. పద్మావతి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. పెన్షన్ అదాలత్‌లో పెన్షనర్లు, పెన్షన్ అసోసియేషన్ ప్రతినిధులు తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. 27 శాఖలకు సంబంధించిన 93 పెన్షన్ పెండింగ్ దరఖాస్తులు, 39 మంది పెన్షనర్లు, జీపీఎఫ్ చందాదారులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో సంగీత, టీడీఏ శ్రీరాజు, వైద్య ఆరోగ్యశాఖ జిల్లా పరిపాలన అధికారి మహ్మద్ షఫియొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సజావుగా ధాన్యం కొనుగోళ్లు

ధాన్యం కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరావు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్‌లతో కలిసి యాసంగి ధాన్యం సేకరణపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. శుక్రవారం నిర్వహించిన ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి సమస్యలు రాకుండా చర్యలు చేపడుతున్నట్లు ఆయన చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్‌డీవో పీడీ శ్రీలత, జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు, సివిల్ సప్లయ్ డీఎం గోపికృష్ణ, మార్కెటింగ్ ఏడీ మహ్మద్ రియాజొద్దీన్ పాల్గొన్నారు.

వ్యవసాయ రంగంలో కాలక్రమేణా అనేక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఆధునిక పద్ధతుల ద్వారా పంటలను సాగు చేస్తున్నారు. రసాయన ఎరువుల వాడకం కూడా పెరిగిపోయింది. దీని ద్వారా నేలసారం దెబ్బతిని పంటల దిగుబడిపై ప్రభావం చూపుతోంది. ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు ఇటీవల అందుబాటులోకి వచ్చిన విధానం 'బయోచార్' వినియోగం. పంట వ్యర్థాలతో రైతులే స్వయంగా ఈ ఎరువును తయారుచేసుకోవచ్చు. ఈ సేంద్రియ వాడకం ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవచ్చు.



'బయోచార్'తో భూసారం

పంట వ్యర్థాలతో సేంద్రియ ఎరువు తయారీ

- ఈ ఎరువు వాడకంతో భూమికి జీవం
- తక్కువ పెట్టుబడితో పంట దిగుబడి, లాభాలు
- ప్రయోగాత్మకంగా ముందుకెళ్తున్న హార్ట్‌ఫుల్‌నెస్, పేపాల్ సంస్థలు
- కన్హాశాంతివనంలో శ్రీకారం చుట్టిన కేంద్ర మంత్రి గడ్కరీ
- పల్లెల్లో బయోచార్ పరిశ్రమలను విస్తరించేందుకు చర్యలు
- గ్రామీణ యువత, మహిళలకు ప్రోత్సాహం



షాద్‌నగర్, మే 16 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో రసాయన ఎరువుల వాడకం పెరిగిపోయింది. ఏ పంట వేయాలన్నా వీటి వినియోగం తప్పనిసరి అయిపోయింది. పంటలకు రసాయన ఎరువులను ఉపయోగించడం వల్ల రానురాను భూమి జీవాన్ని కోల్పోతుంది. అంతేకాకుండా భూమిలోని సూక్ష్మజీవులు అంతరించిపోయి పంటల దిగుబడి తగ్గిపోతోంది. మున్ముందు ఇలాగే కొనసాగితే వ్యవసాయ భూములు పంటలు వేయడానికి పనికిరాకుండా పోయే ప్రమాదముంది. ఈ సమస్యను గుర్తించిన హార్ట్‌ఫుల్‌నెస్, పేపాల్ సంస్థలు బయోచార్ విధానం ద్వారా సేంద్రియ ఎరువుల తయారీకి శ్రీకారం చుట్టాయి. బయోచార్ విధానం పూర్వ కాలంలోనే ఉండేది. కాలక్రమేణ ఇది కనుమరుగైంది. బయో అంటే జీవం.. చార్ అంటే బొగ్గు అని అర్థం. ఈ విధానం ద్వారా తయారు చేసిన ఎరువు వాడకం ద్వారా

మిగతా 8వ పేజీలో...

'సేంద్రియం'తో భూమికి జీవం



సేంద్రియ ఎరువుల వాడకం వల్ల భూమి నాణ్యత పెరుగుతుంది. పశు సంపద కొరత వల్ల ఈ ఎరువుల వాడకం తగ్గిపోయింది. రసాయన ఎరువుల వాడకం వల్ల భూమి సారవంతం కోల్పోయి భవిష్యత్తులో పంటల ఉత్పత్తి పడిపోయే అవకాశాలున్నాయి. హార్ట్‌ఫుల్‌నెస్, పేపాల్ సంస్థలు బయోచార్ సేంద్రియ ఎరువులపై అవగాహన పెంపొందించడం అభినందనీయం. ప్రతీ గ్రామంలో బయోచార్ పరిశ్రమను ఏర్పాటు చేసేలా కృషి చేయాలి.

- నిషాంత్, అసిస్టెంట్ ఏడీఏ, షాద్‌నగర్



అధైర్య పడొద్దు.. ఆదుకుంటాం

అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

ఫ్యూచర్‌సిటీ రోడ్డుకు భూములిచ్చే రైతులకు భరోసా

కందుకూరు, మే16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఫ్యూచర్‌సిటీ వరకు 330పీట్ల వెడల్పుతో నిర్మించనున్న రోడ్డుకు భూములిచ్చే రైతులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం న్యాయం చేస్తామని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. శుక్రవారం మండలంలోని రాచులూరు గ్రామంలో నిర్వహించిన గ్రామసభకు భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ రాజుతో కలిసి హాజరయ్యారు. ఫ్యూచర్ సిటీ వరకు ఏర్పాటు చేసే రోడ్డు నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందని రైతులకు వివరించారు. విలువైన భూములను తీసుకుంటున్న నేపథ్యంలో రైతుల ఇంట్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ గోపాల్, ఆర్ఐ యాదగిరి పాల్గొన్నారు.

- దారికిరువైపులా వ్యర్థాల పారబోత
- తగ్గిపోతున్న రోడ్డు విస్తీర్ణం
- పట్టించుకోని అధికారులు



కొహెడ-ఇబ్రహీంపట్నం బైపాస్ రోడ్డుపై పారబోసిన తాటిముంజల వ్యర్థాలు, మట్టి కుప్పలు

రోడ్డుపై చెత్త.. జనం అవస్థ!

డంపింగ్ యార్డును తలపిస్తున్న బైపాస్ రోడ్డు!

ఆదిభట్ల, మే 16 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మండలం నుంచి ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొహెడ రోడ్డు వరకు కృష్ణా పైపులైన్ వెంట వేసిన బైపాస్ రోడ్డు అధ్వానంగా మారింది. ఇబ్రహీంపట్నం రుచిదాబా నుంచి కొహెడ వరకు 10 కిలోమీటర్ల మేర ఉన్న ఈ రోడ్డు డంపింగ్ యార్డును తలపిస్తోంది. చింతపల్లిగూడ, శేరిగూడ, పోల్కంపల్లి, రాయపోల్, మంచాల రోడ్లను కలుపుతూ పోయే ఈ దారికి ఇరువైపులా వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. ఏళ్లు గడుస్తున్నా అధికారులు, పాలకులు

మిగతా 8వ పేజీలో...

పట్టించుకునే వారు లేరు




కృష్ణా వాటర్ పైపులైన్ వెంట వేసిన బైపాస్ రోడ్డు నాలుగు, ఐదు గ్రామాల లింక్ రోడ్లను కలుపుతూ సాగర్ రోడ్డుకు పోతుంది. రోడ్డు వేసినప్పటి నుండి ఇప్పటి వరకు పట్టించుకునే వారే లేరు. బైపాస్ రోడ్డులో విచ్చల విడిగా రోడ్డుకు ఇరువైపుల వ్యర్థాలను వేస్తుంటే అధికారులు పట్టించుకోవడం లేదు. రోడ్డుపై వేస్తున్న వ్యర్థాలతో రోడ్డు విస్తీర్ణం తగ్గి ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారింది. అధికారుల స్పందించి చర్యలు తీసుకోవాలి.

- తులసిగారి నర్సింహ, ఆదిభట్ల సీపీఎం నాయకులు

కొందుర్గులో ముగిసిన రెవెన్యూ సదస్సులు

చౌదరిగూడ,మే 16(ఆంధ్రజ్యోతి): భూభారతిలో అమలులో భాగంగా రెవెన్యూ సదస్సుల నిర్వహణకు కొందుర్గు మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ప్రభుత్వం ఎంపిక చేసింది. మండలంలో ఈ నెల 5వ తేదీ నుంచి 16వ తేదీ వరకు గ్రామాల వారీగా రెండు బృందాలుగా ఏర్పడి తహసీల్దార్లు రమేష్‌కుమార్, జగదీశ్వర్‌లు రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. వారు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. శుక్రవారం మండల పరిధిలోని టేకులపల్లిలో 11, కొందుర్గు పడమరలో 66 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ రమేష్ కుమార్ తెలిపారు. ఇప్పటి వరకు మండలంలో మొత్తం 573 దరఖాస్తులు రాగా, అందులో 261 ఆన్‌లైన్ నమోదు చేసినట్లు చెప్పారు. అలాగే 121 మందికి నోటీసులు అందజేసినట్లు పేర్కొన్నారు. 464 దరఖాస్తులు అప్రువల్ చేయగా 109 దరఖాస్తులను తిరస్కరించినట్లు తహసీల్దార్ తెలిపారు. శుక్రవారంతో దరఖాస్తుల స్వీకరణ ముగిసిందని, రైతుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో సీసీఎల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్‌గౌడ్, శివకుమార్, శ్రీనివాస్‌రెడ్డి, రాకేష్, ప్రకాష్, అంజనేయులు, సంతోష, రామస్వామి, వెంకటేష్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రపంచ హైపర్ టెన్షన్ డే



హైబీపీ.. అశ్రద్ధ వద్దు!

భయపెడుతున్న అధిక రక్తపోటు

- పట్టణాలు, పల్లెవాసుల్లో బాధితులు
- ముప్పై ఏళ్లు నిండిన వారిలో హైబీపీ
- గుండె, కిడ్నీ తదితర సమస్యలు వచ్చే ప్రమాదం
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు

ఆధునిక యుగంలో ఉరుకుల పరుగుల జీవనం సర్వసాధారణమైపోయింది. వృత్తిరీత్యా ఒత్తిడికి గురికావడం, ఆహార అలవాట్లలో మార్పులు చోటుచేసుకోవడం వల్ల ప్రజలు అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటున్నారు. ప్రధానంగా ప్రస్తుతం బీపీ సమస్య అనేక మందిని భయపెడుతోంది. పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా రక్తపోటుకు గురవుతున్నారు. హైబీపీ వల్ల గుండెలయ దెబ్బతినడం, కిడ్నీ సమస్యలు ఎదురై ప్రాణాలకే ప్రమాదం ఏర్పడే పరిస్థితులు నెలకొంటున్నాయి. మానసిక ఒత్తిడి కారణంగా 30 ఏళ్లు నిండిన వారిలో ఎక్కువమంది బీపీ సమస్యను ఎదుర్కొంటున్నారు. అశ్రద్ధ చేయకుండా వ్యాయామం, యోగా తదితర ప్రక్రియలతో బీపీని అదుపుచేసుకోకపోతే మొదటికే ముప్పు వస్తుందని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. శనివారం 'ప్రపంచ హైపర్ టెన్షన్ డే'ను సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం

రంగారెడ్డి అర్బన్, మే 16 (ఆంధ్రజ్యోతి)

7

తాలు లేకుండా ధాన్యాన్ని తీసుకురావాలి

మేడ్చల్‌టౌన్, మే16 (ఆంధ్రజ్యోతి): రైతులు కొనుగోలు కేంద్రానికి తాలు లేకుండా బాగా ఎండబెట్టి ధాన్యాన్ని తీసుకురావాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రకళ సూచించారు. మేడ్చల్ రైతు సహకార సంఘంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు చేపట్టిన నిరసనపై ఆమె స్పందించారు. జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ సుగుణ బాయితో కలిసి శుక్రవారం సహకార సంఘాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. ఏడీఏ వెంకట రామ్‌రెడ్డి, ఏవో అర్చన, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపనుల్లో నిర్లక్ష్యం

● కంకర, మట్టి వేసి వదిలేసిన కాంట్రాక్టర్ ● వాహనదారుల అవస్థలు



దుమ్మును చూసి నిలిచిపోయిన ద్విచక్రవాహనదారులు

పెద్దేముల్, మే 16 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పనుల్లో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా వాహనదారులు దుమ్ముతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాండూరు-వికారబాద్ రోడ్డు అభివృద్ధికి ప్రభుత్వం రూ.49.78కోట్లు మంజూరు చేసింది. ఈ పనులను తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి గత ఫిబ్రవరి 23న పనులు ప్రారంభించారు. ఆరోజు నుంచి పనులు చేపట్టిన కాంట్రాక్టర్ మన్‌సాన్‌పల్లి నుంచి మంబాపూర్ సమీపం వరకు రోడ్డును అక్కడక్కడ మధ్యలో తవ్వి కంకరమట్టి వేసి వదిలేశాడు. పనులు ప్రారంభించి మూడునెలలు కావస్తున్నా పనులు ముందుకు సాగడంలేదు. ఇది తాండూరు-హైదరాబాద్ ప్రధానరోడ్డు కావడంతో వాహనాల రాకపోకలు వందల సంఖ్యలో వెలుతుంటాయి. వాహనాల రాకపోకల కారణంగా పెద్దఎత్తున దుమ్ములేస్తోంది. దీంతో వాహనదారులకు అవస్థలు తప్పడంలేదు. కాంట్రాక్టర్ రోజుకు రెండు మూడు సార్లు ట్యాంకర్లతో నీళ్లు పడితే దుమ్ము లేవకుండా నివారించవచ్చు. అలాంటి పనులు చేపట్టకపోవడంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. దుమ్మువల్ల ఎదురుగా వస్తున్న వాహనాలు కూడా కనిపించడంలేదు. ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కొద్ది రోజుల కిందట దుగ్గాపూర్ గ్రామానికి చెందిన ఒక మహిళ రోడ్డును తవ్విన ప్రాంతంలో బైక్‌పై నుంచి పడి చేయి విరిగింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



మంబాపూర్ సమీపంలో లేస్తున్న దుమ్ము

ధాన్యానికి మద్దతు ధర కల్పిస్తాం

షాద్‌నగర్ అర్బన్, మే 16(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పించడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందని షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక వర్గం తెలిపింది. మార్కెట్ యార్డులో శుక్రవారం పర్యటించిన పాలకవర్గం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వరి పైరును యంత్రాలతో కోసి, ధాన్యం తూర్పార పట్టకుండా, ఎండబెట్టకుండా యథావిధిగా తీసుకువస్తే ఎలా అని రైతులను ప్రశ్నించారు. వర్షాలు కురుస్తున్నాయని, గ్రామాల్లో కూలీల సమస్య అధికంగా ఉన్నందున.. చేనులో నుంచే ధాన్యాన్ని మార్కెట్‌కు తెచ్చి విక్రయిస్తున్నామని రైతులు సమాధానమిచ్చారు. ధాన్యం పచ్చిగా ఉందని, తూర్పార పట్టలేదని, క్వింటాలుకు రూ.1,800 నుంచి రూ.1,900 వరకు కొనుగోలు చేస్తున్నారని రైతులు తెలిపారు. ధాన్యాన్ని 17శాతం లోపు తేమ ఉండేటట్టు ఆరబెట్టి, తూర్పార పట్టి తీసుకువస్తే రూ.2,320ల మద్దతు ధర, రూ.500 బోనస్ వస్తుందని పాలకవర్గ సభ్యులు వివరించారు. రైతులు పచ్చి ధాన్యం తెచ్చి నష్టపోవద్దని కోరారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఎంసీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్ మాట్లాడారు. ధాన్యానికి మద్దతు ధరను కల్పించాలన్న ఆలోచనతో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయించారని గుర్తుచేశారు. షాద్‌నగర్ నియోజక వర్గంలోని షాద్‌నగర్, కొత్తపేట, ఎదిర, జాకారం, చౌదరిగూడ, పెద్ద ఎల్కిచర్ల, ముట్పూర్ గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, నేటి వరకు 24,630 బస్తాల ధాన్యాన్ని కొనుగోలు చేశారని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో ధాన్యం విక్రయించిన రైతులకు డబ్బులు కూడ వస్తున్నాయన్నారు. షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో సైతం ప్రతీరోజు టెండర్లు వేసేలా చర్యలు తీసుకుంటామని, రైతులను ఇబ్బంది పెట్టే వ్యాపారులను ఉపేక్షించబోమని బాబర్‌ఖాన్ హెచ్చరించారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కరుణాకర్, మల్లేష్, వెంకట్‌రెడ్డి, సురేష్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



మార్కెట్‌లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న పాలకవర్గం



పెద్దఎల్కిచర్లలో అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయిస్తున్న రెవెన్యూ సిబ్బంది, పోలీసులు

అక్రమ నిర్మాణం కూల్చివేత

● కలెక్టర్ ఆదేశాలతో రెవెన్యూ సిబ్బంది చర్యలు

చౌదరిగూడ, మే 16(ఆంధ్రజ్యోతి): జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని పెద్దఎల్కిచర్ల గ్రామంలో గల ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం చేపడుతున్నట్లు గ్రామస్థులు స్థానిక తహసీల్దార్‌తో పాటు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కలెక్టర్ ఆదేశాలతో రెవెన్యూ సిబ్బంది సంఘటనా స్థలాన్ని సందర్శించి చర్యలు చేపట్టారు. ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి సర్వేనంబర్ 130లోని ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం చేపట్టినట్లు గుర్తించి వెంటనే జేసీబీ సాయంతో రాళ్లతో నిర్మించిన కట్టడాలను తొలగించారు. ఆర్ఐ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశానుసారం చర్యలు చేపట్టినట్లు తెలిపారు. గ్రామస్థులు ఎక్కడైనా అక్రమ నిర్మాణాలు జరిపితే మా దృష్టికి తీసుకురావాలని సూచించారు. అదే విధంగా పంచాయతీ కార్యదర్శి వారం రోజులుగా నిర్మాణం జరుగుతున్నా ఎందుకు స్పందించడం లేదంటూ ఫోన్ చేసి అడిగారు. గ్రామంలో అక్రమ నిర్మాణాలు చేపడితే వెంటనే గ్రామ పంచాయతీ యాక్టు ద్వారా చర్యలు తీసుకోవడంతో పాటు రెవెన్యూ సిబ్బందికి సమాచారం అందించాలని సూచించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కాగా, అక్రమ నిర్మాణం కూల్చడంతో గ్రామస్థులు కలెక్టర్‌తో పాటు రెవెన్యూ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

సబితారెడ్డిని విమర్శించే అర్హత కాంగ్రెస్‌కు లేదు

మహేశ్వరం, మే 16 (ఆంధ్రజ్యోతి): నిత్యం ప్రజల కోసం పాటుపడే మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే.. అభివృద్ధి ప్రదాత సబితాఇంద్రారెడ్డిని విమర్శించే కనీస అర్హత కూడా కాంగ్రెస్ నాయకులకు లేదని, మహేశ్వరం నియోజకవర్గంలో సబితారెడ్డి చేసిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధంగా ఉండాలని బీఆర్ఎస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అరవింద్‌శర్మ, ఉపాధ్యక్షుడు గంగాపురం లక్ష్మీనర్సింహారెడ్డిలు కాంగ్రెస్ నాయకులకు సవాల్ విసిరారు. శుక్రవారం మహేశ్వరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంతో పాటు ప్రత్యేక తెలంగాణ ఏర్పడ్డ నాటి నుంచి సుదీర్ఘంగా కీలక మంత్రి పదవులు చేపట్టి ఉత్తమ మహిళా మంత్రిగా, నాయకురాలిగా ప్రజల మన్ననలు పొందుతున్న సబితారెడ్డిని విమర్శించే స్థాయి దేప భాస్కర్‌రెడ్డితో పాటు ఏ ఒక్క కాంగ్రెస్ నాయకుడికీ లేదన్నారు. సబితారెడ్డి చేసిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు కాంగ్రెస్ సిద్ధమా అని ప్రశ్నించారు. ప్రజలను పాలించే సత్తాలేని కాంగ్రెస్ ముఖ్యమంత్రితో పాటు మంత్రి వర్గం మూకుమ్మడి రాజీనామాలు చేసి ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. కొందరు కాంగ్రెస్ నాయకులు వారు మాట్లాడే భాషను మార్చుకోవాలన్నారు. అధికార పార్టీలో ఉండి కేవలం ఫ్లెక్సీలు వేయించుకోలేని కాంగ్రెస్ నాయకులు అధికారిక కార్యక్రమంలో సబితారెడ్డిని విమర్శిస్తారా? అని మండిపడ్డారు. పాలన చేత కాక అభివృద్ధి పనులకు పైసలు లేవని చెప్పిన ముఖ్యమంత్రి చరిత్రలో రేవంత్‌రెడ్డి ఒక్కడేనన్నారు. మహేశ్వరం పీఏసీఎస్ చైర్మన్ పాండుయాదవ్, వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, కర్రోళ్ల చంద్రయ్య, ఆనందం, నవీన్, ఆదిల్‌అలీ, కె.ప్రభాకర్, డి.కృష్ణ, కె.మహేందర్, ఆంజనేయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అరవింద్‌శర్మ

స్వయం ఉపాధితో ఆర్థికవృద్ధి



మహిళలకు సర్టిఫికెట్లు అందజేసిన అంజలీదేవి

యాచారం, మే 16(ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధితో ఆర్థిక ఇబ్బందులు తీర్చుకుంటే పేదరికం నుంచి విముక్తి పొందడం చాలా సులువని రంగారెడ్డి జిల్లా జనశిక్షణ సంస్థాన్ కో-ఆర్డినేటర్ అంజలీదేవి అన్నారు. మండలంలోని మాల్ గ్రామానికి చెందిన వంద మంది మహిళలు కుట్టు (టైలరింగ్)శిక్షణ పొందారు. వారికి శుక్రవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆమె సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అంజలీదేవి మాట్లాడుతూ మహిళలు మహిళల దుస్తులతో పాటు చిన్నపిల్లల దుస్తులు కుట్టడం, ఎంబ్రాయిడరీ నేర్చుకోవడంతో ఆర్థిక ఇబ్బందులు తీర్చుకోవచ్చన్నారు. తమ సంస్థ పేదలను ఆదుకునేందుకు గాను ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని చెప్పారు. త్వరలో మరి కొంత మందికి శిక్షణ ఇవ్వడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిన్నోళ్ల పద్మజ, కాంగ్రెస్ నాయకుడు భట్టు శ్రీనివాస్ తదితరులున్నారు.

పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు

● ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, మే 16(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పారదర్శకంగా చేపడుతున్నట్లు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి దశాబ్దాల సొంతింటి కలను సాకారం చేస్తుందన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ కాంగ్రెస్ నాయకులతో శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, ప్రభుత్వ పథకాల అమలు, మున్సిపాలిటీ అభివృద్ధి తదితర విషయాల గురించి చర్చించారు. నారాయణరెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక, మంజూరులో కమిటీ సభ్యులు, అధికారులు పొరపాట్లకు తావివ్వకూడదన్నారు. కల్వకుర్తి నియోజకవర్గానికి మొదటి విడత 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. మరో వెయ్యి ఇళ్లు అదనంగా ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరగా సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేశవులు, నాయకులు కృష్ణానాయక్, మానయ్య, ఖాదర్ ఖాద్రీ, మైసయ్య, బాబా, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

వైభవంగా వీరనాగమ్మ కల్యాణోత్సవం



వీరనాగమ్మ విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

కేశంపేట, మే 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వీరనాగమ్మ కల్యాణోత్సవం వైభవంగా కొనసాగుతోంది. శుక్రవారం దేవతామూర్తికి గంగస్నానం చేయించి, ప్రత్యేకంగా అలంకరించి గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం విగ్రహమూర్తిని ఆలయానికి తీసుకొచ్చి ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో ఉంచారు. ఒగ్గు కళాకారులచే వీరనాగమ్మ కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆరెకటికలతో పాటు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, శివాజీ, నాగేశ్వర్, శ్రీనివాస్, మహేందర్, సత్యనారాయణ, లక్ష్మణ్, నరేష్, నాగేష్, తదితరులు పాల్గొన్నారు

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి



మేడిపల్లిలో అవగాహన కల్పిస్తున్న సీఐ కృష్ణంరాజు

యాచారం, మే 16(ఆంధ్రజ్యోతి): యూనిఫాం వేసుకున్న తమతో పాటు యూనిఫాం లేని మీరు కూడా పోలీస్ అని గమనించి మసలు కోవాలని, శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతీ ఒక్కరు సహకారమందించాలని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ ఇన్‌స్పెక్టర్ లిక్కి కృష్ణంరాజు అన్నారు. శుక్రవారం సాయంత్రం మేడిపల్లి గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడి అమూల్యమైన జీవితాన్ని పాడు చేసుకోరాదని కోరారు. గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండడంతో పాటు క్రయ విక్రయాలపై పోలీసులకు సమాచారమందించాలని చెప్పారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ, మాజీ సర్పంచ్ బోడ కృష్ణ, కలకొండ బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ అందరికీ ఆదర్శప్రాయుడు

-పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పూడూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందరికీ ఆదర్శప్రాయుడని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని కెరవెళ్లి గ్రామంలో శుక్రవారం అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని రచించిన అంబేడ్కర్ భారతీయ న్యాయవాదిగా, ఆర్థిక శాస్త్రవేత్తగా, రాజకీయ నాయకుడిగా, సంఘ సంస్కర్తగా ఎన్నో సేవలందించారన్నారు. అంటరానితనం, కుల వివక్షను వ్యతిరేకించి సమాజంలో మార్పునకు కృషి చేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేను అంబేడ్కర్ సంఘం నాయకులు శాలువాతో సన్మానించారు.



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు

ఘనంగా కొత్లాపూర్ రేణుకా ఎల్లమ్మ జాతర

తాండూరు రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): భక్తుల కొంగు బంగారం కొత్లాపూర్ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో జాతర ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు పూజాకార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మొదటి శుక్రవారం భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అమ్మవారికి వేపచీర ధరించి ప్రత్యేక అలంకరణ చేశారు. జ్యోతిని మోస్తూ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. కర్ణాటక, మహారాష్ట్రతోపాటు తాండూరు చుట్టుపక్కల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. జాతరలో ఆలయ కమిటీ చైర్మన్ నవీన్ రెడ్డి, ఈవో శేఖర్‌గౌడ్ అక్కడి ఉండి ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. శ్రీనివాస్ పూజారి ఆలయ ప్రతినిధి రవి తదితరులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



అమ్మవారి దర్శనానికి క్యూలో భక్తులు

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి



సబ్‌కలెక్టర్‌కు సమస్యలను విన్నవిస్తున్న రైతులు

బషీరాబాద్, మే 16(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని తాండూరు సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్ అన్నారు. మండలంలోని కాశీంపూర్, మైల్వార్ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ అక్కడి రైతులతో సమస్యలపై ఆరా తీశారు. హమాలీల సమస్యతో తూకాలు సక్రమంగా జరగక రోజుల తరబడి వేచి చూడాల్సి వస్తోందని, రైతులు పలువురు సబ్‌కలెక్టర్ ఎదుట వాపోయారు. ధాన్యం కొనుగోలు జాప్యంతో కిలోమీటరు పొడవున కుప్పలుగా పెట్టి అవస్థలు పడుతున్నామని మొరపెట్టుకున్నారు. అకాలవర్షాలతో ధాన్యం తడిసిపోయి మొలకెత్తుతోందని రైతులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. ఈ విషయమై అక్కడి నిర్వాహకుడు నరేష్‌ను సబ్‌కలెక్టర్ అడిగారు. హమాలీల సమస్య ఉందని, కొనుగోలు చేస్తున్నామని నిర్వాహకుడు తెలిపాడు. అదేవిధంగా తూకలు సక్రమంగా లేక, గన్నీ బస్తాలు సరిపోను లేక ధాన్యం కుప్పలుగా పెడుతున్నామని రైతులు ఆందోళన వ్యక్తంచేశారు. ధాన్యాన్ని మిల్లులకు పంపితే తరుగు పేరిట కోతలు పెడుతున్నారని సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. మిల్లులకు తాను స్వయంగా వెళ్లి పరిశీలిస్తానని రైతులు ఆందోళన చెందవద్దని సబ్‌కలెక్టర్ సూచించారు. ఆయన వెంట బషీరాబాద్ తహసీల్దార్ వై.వెంకటేశ్, కాంగ్రెస్ నాయకులు సోంపల్లి బిచ్చిరెడ్డి తదితరులు ఉన్నారు.



చెక్కులు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

సీఎంఆర్ఎఫ్.. పేదలకు వరం

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

మహేశ్వరం, మే 16 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి పేదలకు వరంలాంటిదని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్ అన్నారు. శుక్రవారం తుక్కుగూడ మున్సిపాలిటీలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన 40మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా కేఎల్లార్ మాట్లాడుతూ చాలా మంది నిరుపేద కుటుంబాలు అనారోగ్యంతో అప్పుల పాలవుతున్నారని.. అలాంటి వారికి సీఎం సహాయనిధి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆశించినమేర లేకున్నా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం తలపెట్టిన ఏ ఒక్క సంక్షేమ పథకానికీ ఆటకం కలగకుండా ముందుకు నడిపిస్తున్నారన్నారు. కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలును చూసి ఓర్వలేని బీఆర్ఎస్, బీజేపీలు ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయన్నారు. ఎవరు ఎన్ని ఆరోపనలు చేసినా ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం తూచా తప్పకుండా అమలు పరుస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, రాజరాజేశ్వరాలయం కమిటీ ఛైర్మన్ కుమార్, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ యాదయ్య, భిక్షపతి, పాండునాయక్ తదితరులు పాల్గొన్నారు.



నేదునూరులో ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న నాయకులు

నిరుపేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

కందుకూరు, మే 16(ఆంధ్రజ్యోతి): నిరుపేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని మాజీ వైస్ ఎంపీపీ గంగుల శమంత ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కె.రాణాప్రతాప్‌రెడ్డి, ఇందిరమ్మ కమిటీ మండల కో-ఆర్డినేటర్ ఎండీ అఫ్జల్‌బేగ్‌లు అన్నారు. శుక్రవారం మండలంలోని నేదునూరు, లేమూరు గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి వారు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారిగా అమలు చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ ఆర్.బిక్కునాయక్, ఏఈ సీహెచ్ వెంకటేశ్వర్లు, నాయకులు డిల్లీ శ్రీధర్, ఎం.ఇంద్రారెడ్డి, ఎం.బాస్కర్, జి.దేవేందర్. ఎండీ రహీమ్, జి.పద్మరాణి, జి.మధుసుధన్‌రెడ్డి, బాలయ్య, రాకేష్‌గౌడ్, సాధ పాండురంగారెడ్డి, బి.సురేష్, పి.యాదిరెడ్డి, బి.శ్రీనివాస్, జి.సురేందర్‌రెడ్డి, జి.సంజీవరెడ్డి, నాగరాజు, పుష్పదర్శన్, పంచాయతీ కార్యదర్శి రాకేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



రైతులతో శాస్త్రవేత్తలు

సుస్థిర సాగుతోనే నేల ఆరోగ్యం

కోట్‌పల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): సుస్థిర వ్యవసాయ సాగుతోనే నేల ఆరోగ్యంగా ఉంటుందని తాండూరు వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త యమునారెడ్డి అన్నారు. మండలంలోని బుగ్గపురం రైతువేదికలో శుక్రవారం నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలుఅనే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచి నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. నూతనసాగు మెలకువలు వివరించారు. వానకాలం సాగు సమయంలో తాండూర్ వ్యవసాయ పరిశోధన సంస్థలో కంది విత్తనాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. రైతులు అడిగిన పలు సబ్సిడీ పరికరాలను నోట్ చేసుకున్నట్లు తెలిపారు. పంట విత్తనాలు కొనుగోలు సమయంలో రసీదు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. భూసార ఆధారిత ఎరువుల యాజమాన్యం చేపట్టి సాగు ఖర్చు తగ్గించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కరుణాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ అంజయ్య, శాస్త్రవేత్త సుజాత, వ్యవసాయ విస్తరణ అధికారులు సందీప్, నర్మద, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీయూటీఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి రఘునందన్‌రెడ్డి

ఉద్యోగులకు ఐదు డీఏలు ప్రకటించాలి

పరిగి, 16 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు రావాల్సిన ఐదు డీఏలను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని టీయూటీఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి రఘునందన్‌రెడ్డి డిమాండ్ చేశారు. పరిగిలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఆర్సీ కమిటీ వేసి రెండేళ్ల కాల పరిమితి పూర్తయిందని, నివేదిక తెప్పించి 51శాతం ఫిట్‌మెంట్‌తోట అమలు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకుగానీ, దేశంలోని 28రాష్ట్రాల ఉద్యోగులకుగానీ ఒక్క డీఏ పెండింగ్‌లో లేదని, తెలంగాణ ఉద్యోగులకు మాత్రమే 30నెలలకు సంబంధించి ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ గోపాల్, జిల్లా అధ్యక్షుడు పి.సత్యనారాయణరెడ్డి, గౌరవ అధ్యక్షుడు బసవరాజు, నాయకులు జాంప్లా, రూప్‌సింగ్, బాలకృష్ణ, ప్రవీన్, నరేందర్, మొగులయ్య పాల్గొన్నారు.

తిరంగ యాత్రను విజయవంతం చేద్దాం

చేవెళ్ల, మే 16(ఆంధ్రజ్యోతి): ఈనెల 17న ట్యాంక్‌బండ్ వద్ద నిర్వహించే తిరంగయాత్రను విజయవంతం చేద్దామని బీజేపీ చేవెళ్ల మున్సిపాలిటీ అధ్యక్షుడు ఎ.అనంతరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ విజయవంతం నేపథ్యంలో పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని ఊచకోత కోసిన భారత సైన్యానికి దేశమంతా ఏకమై అభినందనలు, ప్రశంసలు తెలుపుతోందన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని త్రివిధ దళాలు అందించిన సేవలకు కృతజ్ఞతగా మనమంతా ఐక్యత చాటడానికి పార్టీలకతీతంగా ట్యాంక్‌బండ్ వద్ద నిర్వహించే తిరంగ యాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మృత్యుంజయుడు.. ఆ కార్మికుడు!

రైలు కింద నుంచి ట్రాక్ దాటేందుకు యత్నం

- అకస్మాత్తుగా కదిలిన రైలు
- వెంటనే పట్టాల మధ్య పడుకొని ప్రాణాలను కాపాడుకున్న వైనం

కొత్తూర్, మే 16 (ఆంధ్రజ్యోతి): భూమ్మీద నూకలున్నాయంటే ఇదేనేమో. ఓ కార్మికుడు అగిఉన్న రైలు కింద నుంచి ట్రాక్ దాటేందుకు ప్రయత్నించాడు. అంతలోనే రైలు ఆకస్మాత్తుగా కదిలింది. సమయోచితంగా ఆలోచించిన అతను వెంటనే రెండు పట్టాల మధ్య కదలకుండా నిలువునా పడుకున్నాడు. రైలు వెళ్లిపోయే వరకు అలాగే ఉండి తర్వాత లేచి బతుకు జీవుడా బట్టలు దులుపుకుంటూ ఇంటికి వెళ్లిపోయాడు. ఈ సంఘటన రంగారెడ్డి జిల్లా కొత్తూర్ మండల పరిధిలోని తిమ్మాపూర్ రైల్వే స్టేషన్ వద్ద చోటుచేసుకుంది. మిగతా వివరాలు ఇలా ఉన్నాయి. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అవినాష్(30) తిమ్మాపూర్ సమీపంలో ఓ పరిశ్రమలో కార్మికునిగా పనిచేస్తున్నాడు. అతను స్టేషన్ తిమ్మాపూర్‌లో నివాసం ఉంటున్నాడు. గురువారం సాయంత్రం అవినాష్ విధులు ముగించుకుని ఇంటి వెళ్లేందుకు రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. స్టేషన్ వెనుక భాగాన తన ఇల్లు ఉండడంతో అగిఉన్న గూడ్సు రైలు కింద నుంచి ట్రాక్ దాటేందుకు ప్రయత్నిస్తూ మధ్య వరకు వచ్చాడు. ఆకస్మాత్తుగా రైలు కదలడం గమనించిన అవినాష్ పట్టాల మధ్య నిలువునా పడుకుని ఉండిపోయాడు. రైలు బోగీలు పూర్తిగా వెళ్లిపోయిన తర్వాత లేచి బయటకు వచ్చాడు. అవినాష్‌కు ఎలాంటా గాయాలు కాకపోవడంతో అక్కడున్న వారంతా ఊపిరి పీల్చుకున్నారు. దేవుడే తనను కాపాడడంటూ స్థానికుల వద్ద అవినాష్ కంటతడి పెట్టాడు. ప్రాణాపాయంతో గట్టెక్కిన కార్మికుడిని మృత్యుంజయుడంటూ అభినందించారు. ఈ సంఘటనను స్థానికులు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం ద్వారా వైరల్‌గా మారింది.



నడుస్తున్న రైలు కింద బిక్కు, బిక్కుమంటూ పడుకున్న కార్మికుడు

రైల్వే లైన్‌పై దాటేందుకు ప్రాణాలు ఆరచేతిలో పెట్టుకోవాల్సి వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. రైల్వే లైన్‌పై పూర్తి స్థాయిలో ఓవర్ ఫుట్ బ్రిడ్జిని పెంచాలని స్థానికులు కోరారు.

హైబీపీ.. అశ్రద్ధ వద్దు!

భయపెడుతున్న అధిక రక్తపోటు

జిల్లాలో నమోదైన బీపీ కేసుల వివరాలు

రక్తపోటు పరీక్షలు: 4,81,987

నిర్ధారణ: 1,02,968

నియంత్రణలో: 54,123

2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు..

నేడు ప్రపంచ రక్తపోటు దినోత్సవం



రంగారెడ్డి అర్బన్, మే 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రక్తపోటుకు గురవుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతుంది. తినే ఆహారం, జీవన విధానంలో మార్పులు, మానసిక ఒత్తిడి, ఉద్యోగంలో ఒత్తిడి ఇలా రకరకాల కారణాల వల్ల మనుషుల బీపీ పెరిగిపోతోంది. జిల్లాలో 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు 4,81,987 మందికి బీపీ పరిశీలిస్తే వారిలో 1,02,968 మందికి రక్తపోటు ఉన్నట్లు నిర్ధారించారు. 54,123 మందికి రక్తపోటు నియంత్రణలో ఉన్నట్లు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు.

జిల్లాలోని వేలాది మందిని బీపీ సమస్య పీడిస్తుంది. అత్యధికంగా 1,02,968 మందికి రక్తపోటుతో బాధపడుతున్నట్లు తేలింది. పురుషుల్లోనే ఈ సమస్య అధికంగా ఉందని వైద్యశాఖ లెక్కలు చెబుతున్నాయి. చాలామందికి రక్తపోటు నియంత్రణలో ఉండకపోవడంతో అనేక అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. ముఖ్యంగా గుండెపోటు, కిడ్నీ సమస్యలు వచ్చి ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. బీపీ ఎక్కువగా ఉన్నప్పటికీ చాలా మందిలో ఎలాంటి లక్షణాలు కనిపించక ఒకే సారి ప్రాణమీదికి వచ్చే ప్రమాదముంది. అందుకే దీనిని సైలెంట్ కిల్లర్ అంటారు. అధిక రక్తపీడనం వల్ల గుండెపై భారాన్ని పెంచుతుంది. గుండెకు రక్తప్రసరణను తగ్గిస్తుంది. గుండె కండరాలను బలహీనపర్చి వైఫల్యానికి దారితీస్తుంది. మెదడులోని రక్తనాళాలు సున్నితత్వాన్ని కోల్పోయి, చిట్లిపోయి బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురై పక్షవాతం బారిన పడే అవకాశం ఉంది. అధిక రక్తపోటు వల్ల మూత్ర పిండాలలో ఉన్న రక్తనాళాలు దెబ్బతిని, వాటి వైఫల్యానికి దారితీస్తుంది. రక్తపోటుపై ప్రజలకు అవగాహన కలిగించడానికి వైద్యశాఖ ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం మే 17న 'ప్రపంచ హైపర్ టెన్షన్ డే'ను నిర్వహిస్తుంది.

30 ఏళ్లు నిండిన ప్రతీ ఎనిమిది మందిలో..

బీపీ అనేది చాలా సాధారణంగా మారిపోయింది. కేవలం నగరాలు, పట్టణాలే కాకుండా పల్లెల్లోనూ ఈ సమస్య అనేక మందిని వెంటాడుతుంది. 30 ఏళ్లు దాటిన చాలు ప్రతీ పది మందిలో ఒకరికి బీపీ ఉంటున్న పరిస్థితి ఉందంటే ఈ సమస్య తీవ్రతకు అద్దం పడుతోంది. గ్రామాల్లో 26 శాతం, పట్టణాల్లో 30 శాతం బీపీ బాధితులున్నారని వైద్యశాఖ అంచనా వేసింది. జీవనశైలి కారణంగా తలెత్తే ఈ సమస్యలను నియంత్రించేందుకు ప్రభుత్వం కూడా చర్యలు తీసుకుంటుంది.

తీవ్ర ఒత్తిడితో..

కంప్యూటర్ సంబంధిత ఉద్యోగాలు చేసే వారితోపాటు, ప్రైవేట్ ఉద్యోగులు, నిరుద్యోగులు తీవ్ర ఒత్తిడికి లోనవుతుంటారు. అలాగే ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడం తదితర కారణాల వల్ల రక్తపోటుకు గురవుతుంటారు. గ్రామీణ ప్రాంతాల్లో యాభై ఏళ్లపైబడిన వారు ఎక్కువగా బీపీతో బాధపడుతున్నట్లు తేలింది. వీరందరినీ గుర్తించిన వైద్యారోగ్యశాఖ ప్రతీనెల మందులు పంపిణీ చేస్తోంది.

లక్షణాలు

తీవ్రమైన తలనొప్పి, దృష్టి సమస్యలు, ముక్కు నుంచి రక్తం కారడం, అలసట, తల తిరగడం, ఛాతిలో బరువు, నొప్పిగా ఉండటం, అశాంతి, మాట తడబడటం, భయం, ఊరికే కోపం రావడం, చెమట పట్టడం లక్షణాలు రక్తపోటు రావడానికి ముందు కనిపిస్తాయి.

పరీక్షలు చేయించుకోవాలి



కళ్లు తిరగడం, తల నొప్పి, అలసట, ముక్కు నుంచి రక్తం కారడం, ఛాతిలో బరువు తదితర లక్షణాలు ఉంటే వెంటనే టెస్టులు చేయించుకోవాలి. బీపీ ఉన్నట్లు తేలితే తగ్గించుకునేందుకు ప్రయత్నం చేయాలి. బీపీ ఉన్న వాళ్లు తప్పకుండా డాక్టర్ సలహా మేరకు మందులు వాడాలి. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పాటించాలి. క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ సమయానికి మందులు వేసుకోవాలి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా బీపీకి ఉచితంగా మందులు అందుబాటులో ఉన్నాయి. రోగులకు ఎన్‌సీడీ కిట్ ద్వారా ప్రభుత్వం అన్ని రకాల మందులు అందిస్తోంది. క్రమం తప్పకుండా ఇవి వాడాలి.

- డాక్టర్ వెంకటేశ్వరరావు, జిల్లా వైద్యాధికారి

టీజీఈజేఏసీ వికారాబాద్ జిల్లా

నూతన కమిటీ

వికారాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గవర్నమెంట్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీఈజేఏసీ) వికారాబాద్ జిల్లా నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలో జరిగిన వివిధ ఉద్యోగ సంఘాలకు చెందిన అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు. అన్ని సంఘాల సమన్వయంతో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ చైర్మన్‌గా టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు శివకుమార్, ప్రధాన కార్యదర్శిగా టీజీవో జిల్లా అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, అడిషనల్ జనరల్‌గా పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ ఎన్నికయ్యారు. అదేవిధంగా కో చైర్మన్లు, వైస్ ప్రెసిడెంట్లు, జాయింట్ సెక్రటరీలు, ఇతర కార్యవర్గ సభ్యులుగా అన్ని ఉద్యోగ సంఘాలకు చెందిన ప్రతినిధులు ఎంపికయ్యారు. ఈ జేపీసీలో ఇప్పటికే దాదాపు 30 సంఘాలు భాగస్వామ్యం అయ్యాయి.

డీకే తండాలో విద్యార్థినులకు సన్మానం

ధారూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ డ్రాగన్ చాంపియన్ షిప్ పోటీల్లో, ఫెన్సింగ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన మండలంలోని డీకే తండాకు చెందిన స్రవంతి బాయి, దీపికలను తండావాసులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. తండాకు చెందిన మాణిక్‌రావు, సంతోష్‌కుమారీల కూతురు స్రవంతిబాయి సికింద్రాబాద్‌లోని బోయిన్‌పల్లి బాపూజీ నగర్‌లోని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల వాటర్ స్పోర్ట్స్ ఆకాడమిలో చదువుతోంది. ఫిలిప్పిన్స్‌లో నిర్వహించిన డ్రాగన్ బోట్ పోటీల్లో మూడు (సిల్వర్, 2 కాంస్య) పతకాలు, మధ్యప్రదేశ్‌లో జరిగిన పోటీల్లో సిల్వర్, కాంస్య పతకాలు సాధించింది. అదే తండాకు చెందిన దీపిక తెలంగాణలోని మహబుబాబాద్‌లో నిర్వహించిన ఫెన్సింగ్(ఖడ్గం) పోటీల్లో బంగారు పతకం సాధించింది. వీరిద్దరికి తండావాసులు శాలువాలు కప్పి అభినందించారు. ఈ కార్యక్రమంలో తండావాసులు దేవుజ్యా నాయక్, బాల్‌రాజ్‌నాయక్, రాజునాయక్, బాబురావ్, రాములు నాయక్, మోహన్, బాల్‌రాజ్, బాస్కర్, తండావాసులు పాల్గొన్నారు.

డెంగీని అరికట్టడం అందరి బాధ్యత



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న వెంకటరవణ

వికారాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): డెంగీని అరికట్టాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటరవణ అన్నారు. ప్రతి సంత్సరం మే 16న డెంగీ నివారణ దినోత్సవం జరుపుకుటామని తెలిపారు. శుక్రవారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించగా ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 2030 నాటికి దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నిర్మూలన లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఏళ్లుగా ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెరిగి, పారిశుధ్య కార్యక్రమాలు మెరుగుపడటంతో డెంగీ కేసులు గణనీయంగా తగ్గాయన్నారు. ఈ ఏడాది జిల్లాలో రెండు కేసులు మాత్రమే నమోదయ్యాయన్నారు. ప్రజలు ఇంటి చుట్టూ నీరు నిల్వకుండా చూసుకోవాలని, పాత పాత్రలు, టైర్లు, ప్లాస్టిక్ వస్తువులు తొలగించాలన్నారు. ఓవర్ హెడ్ ట్యాంకులు, డ్రమ్ములకు మూతలు వేయాలని, ప్రతి శుక్రవారం నిల్వ నీటిని మార్చాలన్నారు. ఫాగింగ్, ఆయిల్ బాల్స్, గంబూషియా చేపల వలన దోమల పెరుగుదలను అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ సృజన, డిప్యూటీ డెమో శ్రీనివాసులు, ఎన్‌హెచ్‌ఎం ప్రోగ్రాం అధికారి మహేష్‌కుమార్, సబ్ యూనిట్ ఆఫీసర్ ప్రకాశ్, జీజీహెచ్ సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

దోమలను పారదోలుదాం.. ఆరోగ్యంగా ఉందాం

షాద్‌నగర్, మే 16 (ఆంధ్రజ్యోతి): దోమలను పారదోలి ఆరోగ్యంగా ఉండేందుకు ప్రజలంతా కృషి చేయాలని షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి పిలుపునిచ్చారు. శుక్రవారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ర్యాలీని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రి వద్ద జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దోమకాటు వల్ల మలేరియా, ఫైలేరియా, డెంగీ వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. దోమల నివారణకు ప్రజలంతా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుకోవాలని సూచించారు. మురుగు నీరు, చెత్త నిల్వలు ఉండకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ జర్కుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి

తూంకుంట 'డబుల్' ఇళ్ల పరిశీలన



లబ్ధిదారులను అడిగి తెలుసుకుంటున్న మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్

శామీర్‌పేట, మే 16 (ఆంధ్రజ్యోతి): తూంకుంట మున్సిపల్ పరిధిలోని అలంక్రిత రిసార్ట్స్ వెనుక రెండేళ్ల కిందట అప్పటి సీఎం కేసీఆర్ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ అపార్ట్‌మెంట్‌ను తూంకుంట మున్సిపల్ అధికారులు శుక్రవారం పరిశీలించారు. తూంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్, మున్సిపల్ డీఈఈ సునీత, ఆ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను సందర్శించి పరిశీలించారు. ఆ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ళలో అవసరమైన మౌలిక సదుపాయాలు ఉన్నాయా? అని మున్సిపల్ అధికారులు లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఆ డబుల్ బెడ్‌రూమ్ కాలనీ వాసులకు అసరమైన విద్యుత్ సరఫరా, మంచినీటి సరఫరాపట్ల మున్సిపల్ అధికారులు పర్యవేక్షించారు. ఎలాంటి ఇబ్బందులున్నా తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని కమిషనర్ వెంకట గోపాల్ లబ్ధిదారులకు భరోసా ఇచ్చారు. ఇదిలా ఉండగా, ఏడాదిన్నర కిందట గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆగమేఘాల మీద ఈ అపార్ట్‌మెంట్‌ను ప్రారంభించగా 50శాతం కూడా మౌలిక సదుపాయాలు లేక లబ్ధిదారులు ఇబ్బందులు పడ్డారు. దీంతో చాలా మంది లబ్ధిదారులు అరకొర వసతుల కారణంగా ఇళ్లలో ఉండలేక అక్కడ నుంచి వెళ్లిపోయారు. ఈ విషయమై ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టిసారించి తగుచర్యలు చేపట్టింది. లబ్ధిదారులకు అవసరమైన మౌలిక సదుపాయాల పట్ల స్థానిక మున్సిపల్ అధికారులు చొరవతీసుకుని దాదాపు ఏర్పాట్లు చేశారు. దీంతో ఆ డబుల్ బెడ్‌రూమ్ అపార్ట్‌మెంట్ల ఇళ్లలోకి గత ఆరునెలల నుంచి ఇప్పటి వరకు దాదాపు 456లబ్ధిదారుల కుటుంబాలు గృహప్రవేశం చేసి నివాసముంటున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు ఎప్పటికప్పుడు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పర్యవేక్షించడం పట్ల లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



అభివృద్ధి పనుల వివరాలు తెలుసుకుంటున్న తిరుపతిరెడ్డి

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

కొడంగల్, మే 16 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో శుక్రవారం నారాయణపేట జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ వార్ల విజయ్‌కుమార్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ అంబయ్యగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు నందారం ప్రశాంత్, రఘువర్ధన్‌రెడ్డి తదితరులతో కలిసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేశ్యానాయక్, అధికారులు జ్ఞానేశ్వర్ తదితరులు ఉన్నారు.

డీటీ మధుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు, రైతులు



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

షాబాద్, మే 16(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇప్పటి వరకు వరి ధాన్యం కొనుగోలు కేంద్రం లేదని, రైతులు దళారుల చేతిలో మోసపోయి నష్టపోతున్నారని, వెంటనే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ మండలాధ్యక్షుడు దండు యాదవరెడ్డి అన్నారు. ఈమేరకు శుక్రవారం షాబాద్‌లో డిప్యూటీ తహసీల్దార్ మధుకు రైతులతో కలిసి ఆయన వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ఈ సీజన్‌లో వరి కొనుగోలు కేంద్రం లేకపోవడంతో రైతులు ప్రైవేట్ మార్కెట్‌లో రూ. 1500 నుండి రూ. 1800 అమ్ముకుని తీవ్రంగా నష్టపోతున్నారు. కావున వరి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, సంఘం సభ్యులు వెంకట్‌రెడ్డి, ఒగ్గు మల్లయ్య, చంద్రయ్య, నర్సింహులు, సత్యంగౌడ్, రైతులు చంద్రకళ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీసీలు అన్నిరంగాల్లో రాణించాలి

చౌదరిగూడ, మే 16(ఆంధ్రజ్యోతి): బీసీ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లేడ్ చౌదరిగూడ బీసీసేన మండలాధ్యక్షురాలు ప్యాట జయ అన్నారు. శుక్రవారం ముష్టిపల్లిలో బీసీసేన మహిళ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముష్టిపల్లి అధ్యక్షురాలిగా శంకురిగారి నర్సమ్మ, ఉపాధ్యక్షురాలిగా కన్న అరుణమ్మ, ప్రధాన కార్యదర్శిగా పుష్పమ్మలతోపాటు మరికొంతమందిని సభ్యులుగా ఎన్నుకున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో షాద్‌నగర్ నియోజకవర్గ బీసీ మహిళాధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, బాల్‌రాజ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



కడ్తాల్ : అవగాహన సదస్సులో శాస్త్రవేత్తలు, రైతులు

రసాయనాల వాడకాన్ని తగ్గించాలి

షాబాద్/చేవెళ్ల/ఆమనగల్లు/కడ్తాల్, మే 16(ఆంధ్రజ్యోతి): రైతులు రసాయనాల వాడకాన్ని తగ్గించి, సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడి పొందాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు, డి.శ్రీనివాస్‌రెడ్డి, పి.సతీష్‌లు సూచించారు. షాబాద్ మండలం తిమ్మారెడ్డిగూడ, మద్దూర్‌లో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏవో వెంకటేశం, పశువైద్యాధికారి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ పాండు, సర్పంచ్ మల్లేష్, ఏఈవోలు గీత, రాజేశ్వరి పాల్గొన్నారు. అలాగే రైతులు వరి సాగులో ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలని జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పీజీ స్టడీస్ డీన్ డాక్టర్ కేబీ ఈశ్వరి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రమ్య కవిత కిరణ్ తెలిపారు. చేవెళ్ల మండలం రావులపల్లి, దేవునిఎర్రవల్లిలో రైతులకు సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఏవో శంకర్‌లాల్, ఏఈవోలు బాలకోటేశ్వర్, కార్యదర్శులు పాల్గొన్నారు. పంట మార్పిడి ద్వారా నేల నాణ్యత పెరుగుతుందని శాస్త్రవేత్తలు డాక్టర్ నిర్మల, డాక్టర్ సుజాతలు అన్నారు. ఆమనగల్లు మండలం సంకటోనిపల్లిలో రైతు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇన్‌చార్జి ఏవో అరుణకుమారి, ఏఈవో కేదార్‌సింగ్, మాజీ ఎంపీపీ ధనుంజయ్య, రైతులు మార్కెట్ కమిటీ డైరెక్టర్ రవీందర్, పాల్గొన్నారు. కడ్తాల్ మండలం నాగిరెడ్డిగూడ, న్యామతాపూర్‌లో రైతు అవగాహన సదస్సు నిర్వహించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ అనిత, డాక్టర్ సుప్రజ, డాక్టర్ విద్యాసాగర్‌లు రైతులకు అవగాహన కల్పించారు. ఏవో శ్రీలత, ఏఈవోలు అనూష, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై చెత్త.. జనం అవస్థ!

(5వ పేజీ తరువాయి)

పట్టించుకోకపోవడంతో బైపాస్ రోడ్డు అభివృద్ధికి నోచుకోలేదు. రోడ్డుపై భారీ గుంతలు, కంకర తేలడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

హైదరాబాద్ నుంచి నాగార్జునసాగర్ వైపు వెళ్లే వాహనాలు ఇబ్రహీంపట్నం టౌన్ నుంచి కాకుండా నేరుగా బైపాస్ రోడ్డు మీదుగా సాగర్‌కు వెళ్లేలా నాటి పాలకులు ఈ బైపాస్ రోడ్డును నిర్మించారు. అయితే ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల శరవేగంగా అభివృద్ధి చెందుతున్నా బైపాస్ రోడ్డును మాత్రం పట్టించుకునే నాథుడే లేడు. ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని రాయపోల్, పోల్కంపల్లి, చింతపల్లిగూడ బైపాస్ రోడ్డులో ప్లాస్టిక్, కుళ్లిన వ్యర్థాలను, ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొంగర-చింతపల్లిగూడ మధ్యలో ఉన్న బైపాస్ రోడ్డుకు ఇరువైపులా తాటిముంజల వ్యర్థాలు పారబోస్తున్నారు. దీంతో బైపాస్ రోడ్డు చెత్త కుప్పలతో నిండిపోయి రోడ్డు విస్తీర్ణం తగ్గింది. సంబంధిత శాఖ అధికారులు, పాలకులు పట్టించుకొని వ్యర్థాలను తీయించి, బైపాస్ రోడ్డును అభివృద్ధి చేయాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.



బైపాస్ రోడ్డుపై వేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు

వ్యర్థాలన్నీ రోడ్డుపైనే పారబోత

ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని చింతపల్లిగూడ-కొంగర రోడ్డు మధ్యలో ఉన్న బైపాస్ రోడ్డుకు ఇరువైపుల తాటిముంజల వ్యర్థాలతో పాటు, హోటళ్లలో కుళ్లిన పదార్థాలు, మంగల్‌పల్లి పరిధిలోని నిర్మిస్తున్న కొత్త భవనాల్లో మిగిలిన చెత్తాచెదారం, మట్టి కుప్పలను రోడ్డుకు ఇరువైపులా పోయడంతో రోడ్డు కుచించుకుపోయింది. గట్ఓఆర్ఆర్ సమీపంలో తాటిముంజలు అమ్ముతున్న వ్యక్తులు ఆటోల్లలో చెత్తను తీసుకొచ్చి బైపాస్ రోడ్డుకు ఇరువైపులా పారబోస్తున్నారు. దీంతో ఈ రోడ్డుపై వెళ్లే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఒక వాహనం వస్తే మరొకటి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. బైపాస్ రోడ్డులో కుప్పలుగా వ్యర్థ పదార్థాలు, ప్లాస్టిక్ కవర్లు, తాటిముంజల వ్యర్థాలు వేస్తున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. సాగర్ రహదారిపై ధర్నాలు, రాస్తారోకోలు జరిగినప్పుడు ఇబ్రహీంపట్నం-ఓఆర్ఆర్‌కు ప్రత్యామ్నాయంగా ఉన్న ఈ బైపాస్ రోడ్డును అధికారులు, పాలకులు చొరవ తీసుకొని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అసంపూర్తిగా ఉన్న ఈ దారికి మరిన్ని నిధులు కేటాయించి నిర్మాణం పూర్తిచేయాలని కోరుతున్నారు.

నిధులు కేటాయించాలి



ఇబ్రహీంపట్నంకు లింక్ రోడ్డుగా ఉన్న బైపాస్ రోడ్డు మీదుగా ప్రయాణిస్తే ట్రాఫిక్ సమస్య కొంతమేరకు తగ్గుతుంది. ఇబ్రహీంపట్నంలో ఇంజనీరింగ్ విద్యాసంస్థలు ఉండడంతో వాహనల రద్దీ పెరిగి తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రోడ్డు అభివృద్ధికి నిధులు కేటాయించి అందుబాటులోకి తీసుకురావాలి.

- పైయిళ్ల తిరుమల్‌రెడ్డి, బొంగ్లూర్

క్రైం కార్నర్

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

● ప్రేమలో విఫలమై మనస్తాపంతో అఘాయిత్యం

చేవెళ్ల, మే 16 (ఆంధ్రజ్యోతి): ప్రేమ వ్యవహారంలో భాగంగా మనస్తాపం చెందిన ఓ యువకుడు చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముడిమ్యాల్ అటవీ ప్రాంతంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి కథనం మేరకు.. నారాయణపేట జిల్లా దామరగిద్ద మండల పరిధిలోని కంసాన్‌పల్లికి చెందిన కుమ్మరి బాబమ్మ కుమారుడు రవి(22) బతుకు దెరువు నిమిత్తం కొంతకాలంగా నగరంలోని నార్సింగ్ ప్రాంతంలో ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో తను ప్రేమించిన అమ్మాయి విషయంలో మానస్తాపం చెందిన రవి శుక్రవారం తెల్లవారు జామున చేవెళ్ల మండల పరిధిలోని ముడిమ్యాల్ అటవీ ప్రాంతంలోకి వెళ్లి ఓ చెట్టుకు తాడుతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు గమనించి చేవెళ్ల పోలీస్‌లకు సమాచారం అందించడంతో వారు సంఘటన స్థలానికి చేరుకొని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడు రవి తల్లి బాబమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్‌లు తెలిపారు. మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

గంజాయి చాక్లెట్ల విక్రయం..
ఇద్దరి అరెస్ట్.. రిమాండ్

● 810 గ్రాములు స్వాధీనం



పట్టుబడిన గంజాయి చాక్లెట్ ప్యాకెట్లు

ఆదిభట్ల, మే 16(ఆంధ్ర జ్యోతి): గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఆదిభట్ల పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈమేరకు నిందితుల నుంచి 810 గ్రాముల గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. సీఐ రాఘవేందర్‌రెడ్డి శుక్రవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రాజస్థాన్‌కు చెందిన శ్రవణకుమార్ (36)తుర్కయంజాల్ మున్సిపల్, కమ్మగూడ రోడ్డులో పాన్‌షాప్ నిర్వహిస్తున్నాడు. ఈక్రమంలో ఇతడికి ఒడిషాకు చెందిన అజిత్ సర్దార్(55) పరిచయం అయ్యాడు. ఇద్దరూ కలిసి గంజాయి చాక్లెట్లు విక్రయిస్తూ డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. శ్రవణకుమార్ రాజస్థాన్ నుంచి గంజాయి చాక్లెట్లు తీసుకొచ్చి అజిత్ సర్దార్‌కు సరఫరా చేసేవాడు. అతడు టీసీఎస్, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్ సమీపంలోని అడ్డా కూలీలకు విక్రయించేవాడు. ఇలా వారు నాలుగు నెలలుగా గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దాంతో బుధవారం టీసీఎస్ ప్రాంతంలో నిఘా పెట్టి గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న ఆ ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. 810 గ్రాముల చాక్లెట్లు స్వాధీనం చేసుకొని అరెస్టుచేసి రిమాండ్ తరలించారు.

మహిళ అదృశ్యం.. కేసు నమోదు



హసమ్మ(ఫైల్)

ఆదిభట్ల, మే 16(ఆంధ్రజ్యోతి): కొంగరకలాన్ గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని హసమ్మ(29) అనే మహిళ అదృశ్యమైనట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు. కొంగరకలాన్‌కు చెందిన హసమ్మ ఈనెల 12వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఆచూకీ తెలిసినవారు 8712662 383, 8712662671 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

ఘనంగా ఎమ్మెల్యే యాదయ్య జన్మదిన వేడుకలు





ఎమ్మెల్యే యాదయ్యకు శుభాకాంక్షలు తెలుపుతున్న చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డి

చేవెళ్ల, మే 16(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కాలె యాదయ్య జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఎమ్మెల్యే తన పుట్టిన రోజు సందర్భంగా చేవెళ్ల పట్టణ కేంద్రంలోని శ్రీలక్ష్మీ బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. పట్టణ కేంద్రంలో మహనీయుల విగ్రహాలకు నివాళులర్పించారు. అనంతరం కేజీఆర్ గార్డెన్ వరకు ర్యాలీగా వెళ్లి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేక్‌ను ఎమ్మెల్యే కట్ చేశారు. నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హ్యాట్రిక్ ఎమ్మెల్యే యాదయ్య అంటూ కేక్ తినిపించి.. యాదన్న జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. 211 మంది రక్తదాతలకు సర్టిఫికెట్లను అందజేశారు. క్యాంపు కార్యాలయంలో అన్ని మండలాలకు చెందిన వివిధ శాఖల అధికారులు ప్రత్యేకంగా ఎమ్మెల్యేను సన్మానించారు. ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించి కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. యాదయ్య మున్ముందు మరిన్ని జన్మదిన వేడుకలను జరుపుకోవాలని భగవంతుడిని కోరుకున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తనపై అభిమానంతో ఇంత పెద్దమొత్తంలో చేవెళ్ల నియోజకవర్గ ప్రజలు తరలివచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలుపడం చాలా సంతోషంగా ఉందన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, చేవెళ్ల, ముడిమ్యాల్ పీఏసీఎస్ చైర్మన్లు వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, చేవెళ్ల మాజీ జెడ్పీటీసీ మాలతీకృష్ణారెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ఎం.యాదగిరి, మాజీ సర్పంచ్‌లు బండారు శైలజాఆగిరెడ్డి, ఎం. మోహన్‌రెడ్డి, దావల్‌గారి గోపాల్‌రెడ్డి, రాంచంద్రయ్యగౌడ్, చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు బి.శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షురాలు సమతారెడ్డి, ప్రధాన కార్యదర్శి సరితారెడ్డి, ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు, చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్, నవాబ్‌పేట్ తదితర మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా, ఎమ్మెల్యే యాదయ్య సీఎం రేవంత్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎం ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



చేవెళ్లలో యాదయ్యకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు చెబుతున్న ప్రజాప్రతినిధులు

ప్రజాపాలనలో మహిళలకు పెద్దపీట



షాద్‌నగర్ : జంతు నియంత్రణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శంకర్

షాద్‌నగర్‌రూరల్, మే16(ఆంధ్రజ్యోతి): ప్రజా పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు పెద్ద పీట వేస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం అన్నారంలో శుక్రవారం జైభీమ్, జైబాపు, జైసంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. గత ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాది లోపు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చినట్లు చెప్పారు. అంతకుముందు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్, గాంధీ విగ్రహాలకు నివాళులర్పించారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, మాజీ సర్పంచ్ రాములుగౌడ్, హౌసింగ్ పీడీ డీసీ నాయక్, ఎంపీడీవో బన్సీలాల్ పాల్గొన్నారు. వీధికుక్కల నివారణ కోసం చేపట్టిన జంతు నియంత్రణ కేంద్రాన్ని ఎమ్మెల్యే శంకర్ షాద్‌నగర్‌లో ప్రారంభించారు. జంతు నియంత్రణ కోసం రూ.30లక్షలతో చేపట్టిన కేంద్రం వల్ల భవిష్యత్తులో వీధి కుక్కల బెడద తప్పుతుందని అభిప్రాయపడ్డారు. కమిషనర్ సునీత, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బాబర్‌ఖాన్, బస్వం, రఘునాయక్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

నేడు కేశంపేటలో ఎమ్మెల్యే వీర్లపల్లి పర్యటన

కేశంపేట : మండలంలో నేడు(శనివారం) ఎమ్మెల్యే శంకర్ పర్యటించనున్నట్లు పార్టీ మండలాధ్యక్షుడు వీరేశ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వై.యాదయ్య యాదవ్‌లు వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. ఎక్లాస్‌ఖాన్‌పేట, భైర్కాన్‌పల్లిలో ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గుపోసే కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు తరలిరావాలన్నారు.

సేవా కార్యక్రమాల్లో పాలు పంచుకోవాలి



అంబలి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్, మే16(ఆంధ్రజ్యోతి): సామాజిక సేవా కార్యక్రమాల నిర్వాహణలో ప్రతీఒక్కరు పాలు పంచుకోవాలని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పాలశీతలీకరణ కేంద్రం ఎదుట గూడూరు శ్రీనివాస్‌రెడ్డి తన తల్లిదండ్రులు పుష్పమ్మ-నారాయణరెడ్డిల స్మారకార్థం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం రాగి అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గీతా నర్సింహ, వైస్ చైర్మన్ బాస్కర్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ జి.చెన్నకిషన్‌రెడ్డి, తహసీల్దార్ ముంతాజ్, ఎంపీడీవో సుజాతలతో కలిసి శ్రీనివాస్‌రెడ్డి అంబలి కేంద్రాన్ని ప్రారంభించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, లయన్స్‌క్లబ్ సభ్యులు పెద్దసంఖ్యలో పాల్గొని అంబలిని పంపిణీ చేశారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యానాయక్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, మాజీ ఎంపీటీసీ లక్ష్మయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలలో ప్రభుత్వ నిర్లక్ష్యం

ఆమనగల్లు, మే 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తుందని తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మీసాల లక్ష్మీనివాస్ ఆరోపించారు. రాష్ట్రంలో సుమారు 8వేల కోట్ల బకాయిలు పేరుకుపోయాయని అన్నారు. ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో లక్ష్మీనివాస్ మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయక పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారన్నారు. రీయింబర్స్‌మెంట్ విడుదల కాక ప్రైవేట్ విద్యా సంస్థలు కూడా అధ్యాపకుల వేతనాలు చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. బకాయిలు ఓటీఎస్ కింద సెటిల్ చేసి ఇక నుంచి విద్యా సంవత్సరం ప్రారంభంలోనే చెల్లించి సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. బకాయిల విడుదలలో ప్రభుత్వం నిర్లక్ష్యం వీడకపోతే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని లక్ష్మీనివాస్ హెచ్చరించారు. టీఎస్ఎస్‌వో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వంశీ, రాష్ట్ర కో-ఆర్డినేటర్ సుదర్శన్, చిక్కి, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

డెంగీ పట్ల అప్రమత్తంగా ఉండాలి



షాబాద్ : ర్యాలీ నిర్వహిస్తున్న డా.ప్రణీత్, వైద్యసిబ్బంది



కొత్తూర్ : ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ వైద్య సిబ్బంది

కేశంపేట, మే 16(ఆంధ్రజ్యోతి): డెంగీ పట్ల అప్రమత్తంగా ఉండాలని కేశంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ నిఖిత సూచించారు. శుక్రవారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీహెచ్‌ఈవో నరసింహా రెడ్డి, సిబ్బంది అంజిలమ్మ, సుదీప్తి ఆశాలు పాల్గొన్నారు.

షాబాద్ : ప్రజల ఆరోగ్యానికి ప్రధాన శత్రువు దోమలేనని.. అవి పుట్టకుండా.. కుట్టకుండా చూద్దామని చందన్‌వెల్లి పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ ప్రణీత్ అన్నారు. చందన్‌వెల్లిలో సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని ఆయన సూచించారు. నవీన్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తూర్ : స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ కవిత ఆధ్వర్యంలో సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. డెంగీ, మలేరియా నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఆమనగల్లు : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ మంజులాదేవి అన్నారు. పట్టణంలో డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట వైద్యురాలు మంజులాదేవి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రధాన వీధుల మీదుగా ర్యాలీ చేపట్టారు. డాక్టర్ రచనాసింగ్, సూపర్ వైజర్ నాగేశ్వరి, ఎంపీహెచ్‌ఈవో తిరుపతిరెడ్డి, సిబ్బంది ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆమనగల్లు : ర్యాలీలో వైద్యులు, సిబ్బంది



కేశంపేట : ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

ఘనంగా దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన

షాబాద్, మే 16(ఆంధ్రజ్యోతి): శ్రీసీతారామ లక్ష్మణ హనుమాన్, నవగ్రహ, శివపంచాయతన నాగ, ధ్వజ శిఖర ప్రతిష్ఠాపన కార్యక్రమం శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మండల పరిధిలోని హైతాబాద్‌లో వేద పండితులు విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు రామనామ స్మరణతో మార్మోగాయి. భక్తులు అధికసంఖ్యలో వచ్చారు. స్వామివారిని ఎమ్మెల్యే యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీత చైర్మన్ తలారి మల్లేష్, వైస్‌చైర్మన్ కావలి చంద్రశేఖర్, మాజీ జడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

విద్యుత్ సమస్యను పరిష్కరించండి

చౌదరిగూడ, మే 16(ఆంధ్రజ్యోతి): జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని కాస్లాబాద్, కాస్లాబాద్ తండాలో మూడు రోజులుగా విద్యుత్ సమస్య నెలకొందని, ఏఈ రవికుమార్ ఈ విషయమై విన్నవించినా కనికరించడం లేదని కాస్లాబాద్ మాజీ సర్పంచ్ మోకార్ల గోపాల్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మూడు రోజులుగా గ్రామంలో విద్యుత్ సమస్య ఉందని ఏఈ రవికుమార్‌కు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చినా స్పందించడం లేదని తెలిపారు. కరెంట్ లేకపోవడం తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని చెప్పినా స్పందించలేదని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. మా సమస్యను ఎవరికి చెప్పాలో అర్థంకావడం లేదని ఆయన వాపోయారు.

అట్టహాసంగా నరోత్తంరెడ్డి జన్మదిన వేడుకలు



శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి కేక్ కట్ చేస్తున్న నరోత్తంరెడ్డి

తలకొండపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకుడు నరోత్తంరెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం తలకొండపల్లి మండలం చీపునుంతల గ్రామంలో ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సీఎల్ శ్రీనివాస్‌యాదవ్, ఆమనగల్లు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నాలాపూరం శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. నాయకులు, కార్యకర్తలతో కలిసి నరోత్తంరెడ్డి కేక్ కట్‌చేసి ప్రజలకు పంచి పెట్టారు. గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, మాజీ సర్పంచ్ వెంకటయ్య, పర్వతాలు యాదవ్, రాజేశ్వర్‌రెడ్డి, గుమ్మడి రాజు, గోస్కె గిరి, చినుకుంట్ల రాజు, చెట్ల కాంతు, రామకృష్ణ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

'పది'లో పాస్ కాని విద్యార్థులకు ప్రత్యేక బోధన

కందుకూరు, మే 16(ఆంధ్రజ్యోతి): 2024-25 విద్యా సంవత్సరంలో టెన్త్ ఫెయిల్ అయిన విద్యార్థులకు సెలవు దినాలను లెక్కచేయకుండా నేదునూరు ఉన్నత పాఠశాల టీచర్లు ప్రత్యేక బోధన చేస్తున్నారు. వివిధ సబ్జెక్టుల్లో ఫెయిలైన విద్యార్థులకు టీచర్లు ఎండీ బషీర్, విజయ మోహన్‌రెడ్డి, సురేష్, శాంతికుమార్, కౌసల్య, శ్రీవాణిలు బోధిస్తున్నారు. జూన్‌లో సప్లిమెంటరీ పరీక్షలు నిమిత్తం ఒకటి, రెండు సబ్జెక్టులు తప్పినవారికి ప్రత్యేకంగా బోధిస్తున్నట్లు శుక్రవారం టీచర్లు తెలిపారు.

'బయోచార్'తో భూసారం

(5వ పేజీ తరువాయి)

మొక్కలకు పోషకాలు అందడం తోపాటు పంటలకు ఉత్పత్తి పెరుగుతుంది. అంతేకాకుండా భూసారం పెరిగేందుకు దోహదపడుతుంది. చిన్న, సన్నకారు రైతులకు ప్రయోజనం చేకూరేలా హార్ట్‌ఫుల్‌నెస్, పేపాల్ సంస్థలు నందిగామ మండలం పరిధిలోని కన్హాశాంతి వనంలో బయోచార్ విధానం ద్వారా ఎరువుల తయారీని ప్రారంభించాయి. ఈ సేంద్రియ ఎరువు తయారీ ప్రారంభ వేదిక తెలంగాణ రాష్ట్రంలో రంగారెడ్డి జిల్లా కావడం విశేషం. బయోచార్ ఎరువు తయారీలో రైతులతో పాటు గ్రామీణ యువకులు, మహిళలను భాగస్వామ్యం చేసి వీరు ఆదాయం పొందేలా హార్ట్‌ఫుల్‌నెస్, పేపాల్ సంస్థలు కృషి చేస్తున్నాయి.



బయోచార్ తయారీకి కావల్సిన అవశేషాలు

ప్రధాన లక్ష్యం..

బయోచార్ ఎరువు తయారీతో వ్యవసాయ రంగాన్ని మరింత అభివృద్ధి చేయడమే హార్ట్‌ఫుల్‌నెస్, పేపాల్ సంస్థల ప్రధాన లక్ష్యం. ఇందుకోసం గ్రామీణ ప్రాంతాల్లో ఓ పరిశ్రమలా బయోచార్ ఎరువును తయారు చేసేందుకు ముందుకు సాగుతున్నారు. దీనికోసం గ్రామీణ యువత, మహిళలను భాగస్వామ్యం చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా అధునాతన వ్యవసాయ సాంకేతికతతో పాటు సాగు పరిజ్ఞాన్ని పెంచడం, పంట దిగుబడి, మెరుగైన ఆదాయం పొందడం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నారు. అదేవిధంగా బయోచార్ ఎరువుల వినియోగం ద్వారా రసాయన ఎరువులను పూర్తిగా వదిలివేయడం, నేలసారం మెరుగు పర్చడం, పంట దిగుబడిని ఇప్పుడున్న దానికంటే 10 నుంచి 30 శాతానికి పెంచడం, అటవీ ప్రాంతాలను విస్తరించడం, మట్టి నాణ్యతను పెంచడమే ప్రధాన లక్ష్యంగా ఈ రెండు సంస్థలు ముందుకు సాగుతున్నాయి.

ముందుకు ఇలా..

అధికారిక లెక్కల ప్రకారం దేశంలో ప్రతి ఏటా 600 మిలియన్ టన్నుల వ్యవసాయ అవశేషాలలో 160 మిలియన్ టన్నులు కాలిపోతున్నాయి. ఈ వ్యవసాయ అవశేషాలను బయోచార్‌గా మార్చినప్పుడు అది వేల సంవత్సరాలు జడత్వంగా ఉంటుంది. దీనిని ప్రయోగాత్మకంగా మధ్యప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాలలో 144మంది రైతులు చేపట్టారు. దీనిద్వారా పత్తి దిగుబడి 17 శాతం నుంచి 37శాతం వరకు పెరిగింది. భూమి నాణ్యత, వాతావరణ మార్పులను బట్టి ఇది ప్రయోజనాలను అందిస్తుంది.

పెరిగిన వరి సాగు విస్తీర్ణం

ఆమనగల్లు, మే 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ చేయూతతో వరి సాగు విస్తీర్ణం, దిగుబడి గణనీయంగా పెరిగిందని ఆమనగల్లు మార్కెట్ చైర్‌పర్సన్ గీతా నర్సింహ అన్నారు. ఆమనగల్లు మార్కెట్ యార్డ్‌ను శుక్రవారం డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, మార్కెట్ కమిటీ సూపర్ వైజర్ రాజేశ్వరి, డైరెక్టర్లతో కలిసి గీత పరిశీలించారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని నిర్వాహకులకు ఆదేశించారు. రెండు తూకం మిషన్లను అదనంగా ఏర్పాటు చేయించి తేమ శాతం వచ్చిన 18 మంది రైతుల ధాన్యాన్ని తూకాలు వేయించారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

మాడ్గుల, మే 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అప్పారెడ్డిపల్లిలో 120 మంది కూలీలకు సంబంధించి నెలరోజుల డబ్బులు పెండింగ్‌లో ఉంచారని.. వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పి.అంజయ్య డిమాండ్ చేశారు. మండలంలోని అప్పారెడ్డిపల్లిలో శుక్రవారం పనులు చేస్తున్న కూలీల సమస్యలు తెలుసుకున్నారు.

'పట్నం' డిపోలో కార్మిక జేఏసీ ఏర్పాటు

ఇబ్రహీంపట్నం, మే 16(ఆంధ్రజ్యోతి): టీజీఆర్టీసీ ఇబ్రహీంపట్నం డిపోలో కార్మికుల సమస్యలపై వివిధ సంఘాలు శుక్రవారం సమావేశం ఏర్పాటు చేసి నూతన జేఏసీ ఏర్పాటు చేశారు. టీఎంయూ, టీజేఎంయూ, ఎస్‌డబ్ల్యుయూ, ఎస్‌డబ్ల్యుఎఫ్, బీకేయూ ఐక్యంగా జేఏసీని ఏర్పాటు చేసినట్లు ప్రకటించాయి. జేఏసీ కన్వీనర్‌గా వి.శ్రీనివాస్, కో-కన్వీనర్లుగా పి. జంగయ్య, ఎండీ రజాక్, జీఆర్ చందర్, ఎండీ సిరాజ్, పి.సత్తయ్య, కోశాధికారిగా ఎం.మల్లేష్, ప్రచార కన్వీనర్‌గా జి.సురేష్, సభ్యులుగా శ్రీశైలం, యాదయ్య, పరమేష్, దర్శన్, నర్సింహ, ప్రవీణ్, రవీందర్‌లను ఎన్నుకున్నారు.

ఎండలో ఉపాధి పనులు చేయొద్దు

యాచారం, మే 16(ఆంధ్రజ్యోతి): ఎండలో ఉపాధి పనులు చేసి రోగాల బారిన పడరాదని యాచారం మండల ఇన్‌చార్జి ఎంపీడీవో శైలజ కూలీలను కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో చేపట్టిన పాంపౌండ్ పనులను పరిశీలించారు. కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం హరితహారం నర్సరీని ఆమె తనిఖీ చేశారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కడ్తాల్, మే 16 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత పటిష్ఠం చేయాలని ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గీత, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రానికి చెందిన యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్యామ రాజేశ్ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జిగా నియమితులైనందున శుక్రవారం సత్కరించి అభినందించారు.